

పెనుబర్తి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని పెనుబర్తి పంచాయతీ సర్పంచ్ తమ్మినేని ఝాన్సీ చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపిడిఒ మీసాల మన్మథరావు తెలిపారు. పంచాయతీ ఖాతా నుంచి తీర్మానం, కార్యదర్శి సంతకం లేకుండా రూ.లక్ష నిధులను డ్రా చేసి తన సొంతానికి వాడుకున్నట్లు రుజువు కావడంతో డిపిఒ చెక్ పవర్‌ను రద్దు చేశారన్నారు. పంచాయతీ తీర్మానం లేకుండా నిధులు డ్రా చేసినట్లు పంచాయతీ వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై నవంబరు 28న డిఎల్‌పిఒ పెనుబర్తి గ్రామంలో విచారణ చేశారు. ఈ విచారణలో వార్డు సభ్యులు చేసిన ఆరోపణలు రుజువు కావడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

విస్తారంగా వర్షాలు

- జిల్లాలో పలుచోట్ల భారీ వర్షపాతం నమోదు
- బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం
- తడిసిముద్దవుతున్న ధాన్యం
- పలుచోట్ల పొలాల్లో నీటిమునుగుతున్న పంట

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళా ఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. అల్పపీడనం ఉత్తర దిశగా కదులుతుండడంతో జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిల్లాలో పలుచోట్ల భారీ వర్షపాతం నమోదైంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులను కంటి మీద కనుకు లేకుండా చేస్తున్నాయి. వర్షాల నేపథ్యంలో రైతులు పంట కోతలను వాయిదా వేయడంతో ప్రస్తుతం అవి నీటమునుగుతున్నాయి. మరోవైపు నూర్పులు పూర్తయిన ధాన్యాన్నీ రైతులు అమ్ముకోలేని పరిస్థితిలో ఉన్నారు.

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత 24 గంటల్లో సగటున 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో రాత్రి ఎనిమిది గంటల సమయానికి సంతబొమ్మాళిలో అత్యధికంగా 31.25 మి.మీ వర్షం కురిసింది. గారలో 30 మి.మీ, కోటబొమ్మాళిలో 29 మి.మీ వర్షం పడింది. కవిటి మండలం రాజపురంలో 28.25 మి.మీ, టెక్కలి మండలం రావివలసలో 28 మి.మీ, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 24.5 మి.మీ వర్షం పడింది. ఇచ్ఛాపురంలో 23.5 మి.మీ, లావేరులో 22.75 మి.మీ, రణస్థలం మండలం గరికపాలెంలో 22.5 మి.మీ మేర వర్షం కురిసింది. సోంపేట మండలం బాతుపురంలో 21.75మి.మీ, జలుమూరులో 21 మి.మీ, కంచిలిలో 20.75 మి.మీ వర్షపాతం నమోదైంది. జి.సిగడాం, నరసన్నపేట ప్రాంతాల్లో 19.75 మి.మీ చొప్పున వర్షం కురిసింది. ఎల్ఎన్‌పేటలో 19.5 మి.మీ, ఎచ్చెర్లలో 19 మి.మీ వర్షపాతం నమోదైంది.

నీటమునుగుతున్న వరి పంట

వర్షాలతో పలుచోట్ల వరి పంట నీట మునుగుతోంది. జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, మందస, సోంపేట, గార, లావేరు ప్రాంతాల్లో ఆలస్యంగా విత్తనాలు వేయడంతో ఇప్పుడు కోతలకు వచ్చాయి. మూడు రోజులుగా అడపదడపా వానలు పడుతుండడంతో రైతులు కోతలను వాయిదా వేశారు. దీంతో పంట నీట మునుగుతోంది. కోతలు కాకుండా ఉన్న వరి సుమారు 70 వేల ఎకరాల వరకు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. నూర్పులు కాక 1.45 లక్షల ఎకరాల వరకు కుప్పలుగా పోసి ఉంచినట్లు చెప్తున్నారు.



లావేరులో కుప్పలు పెట్టిన పొలాల్లో చేరిన వర్షపు నీరు

మరో రెండు రోజులు వర్షాలు

బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం క్రమేపీ వాయుగుండంగా మారుతున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో జిల్లాలో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. శనివారం భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ధాన్యం సేకరణపై తీవ్ర ప్రభావం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ధాన్యం సేకరణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు ధాన్యం సేకరణకు ఇబ్బందిగా మారింది. ధాన్యంలో 17 శాతం తేమశాతం దాటితే వాటిని అధికారులు తీసుకునే పరిస్థితి ఉండకపోవడంతో, రైతులు కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. వర్షాలు పడుతుండడంతో అటు ధాన్యం రవాణా, తరలింపునకూ ఇబ్బందిగా మారింది. దీంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు మందగించాయి. సాధారణంగా ఈకాలంలో రోజుకు 10 వేల నుంచి 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుండేవి. ఈనెల 19న 10,865 మెట్రిక్ టన్నులు, 18న 10,482 మెట్రిక్ టన్నులు, 17న 11,687 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. శుక్రవారం వర్షాల తీవ్రత పెరగడంతో 3,362 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగలిగారు.

చి'వరి'కి క'న్నీరే'...

ప్రజాశక్తి - కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లెదటే కన్నీటి పాలవుతుంటే కర్షకుని గుండె తరుక్కుపోతోంది. అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోసిన పంట భద్రపరుచుకోవడానికి రైతులు ఆపసోపాలు పడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 2,662 ఎకరాల్లో వరి సాగు చేస్తే, ప్రస్తుతం సగం ప్రాంతంలో మాత్రమే కోతలు పూర్తయిన పరిస్థితి ఉంది. దీంతో ఎంతో శ్రమకోడ్చి పండించిన పంట చేతికందిన సమయానికి చినుకుపాలవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతులను అప్రమత్తం చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాతే కోతలు, నూర్పులు చేసుకోవాలని సూచించారు.



కవిటిలో తడిచిన వరిచేను

రంగు మారిన ధాన్యం కొనుగోలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - నరసన్నపేట, పోలాకి

వర్షాల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందొద్దని... తడిచి ముద్దయిన, రంగు మారిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో పంట పొలాలను శుక్రవారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులు పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో వరి కోతలు పూర్తి చేసినా ధాన్యం పొలాల్లోనే ఉన్నాయని తెలిపారు. వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యల్లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నేతృత్వాన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

నేడు ప్రాజెక్టు కమిటీల ఎన్నిక

వంశధార, నారాయణపురం కమిటీలను ఎన్నుకోనున్న సభ్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు వచ్చింది. ఈనెల 14న నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. సాగునీటి సంఘాల ఎన్నిక పోరులో చివరి దశ అయిన ప్రాజెక్టు కమిటీలకు శనివారం ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వంశధార, నారాయణపురం ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు శ్రీకాకుళం నగరంలోని జలవనరులశాఖ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా ఈనెల 17న జిల్లాలోని 16 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు (డిసి) అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. వారిలో డిసి అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. వంశధార ప్రాజెక్టు కమిటీలో జలుమూరు మండలం పర్లాం, నరసన్నపేట మండలంలో నరసన్నపేట, పోలాకి మండలంలో పోలాకి, సంతబొమ్మాళి మండలం గోవిందపురం, మేఘవరం, టెక్కలి మండలం నౌపడ, వజ్రపుకొత్తూరు మండలం వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం మండలం సింగుపురం, ఎల్ఎన్‌పేట మండలం ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలం సరుబుజ్జిలి, గార మండలం అంపోలు డిసిలు ఉన్నాయి. నారాయణపురం డిసిలో ఆమదాలవలస మండలంలోని కొర్లకోట, పొందూరు మండలం తాడివలస, గోరింట, ఎచ్చెర్ల మండలం పొన్నాడ, శ్రీకాకుళం మండలం అరసవల్లి డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి.

ఎన్నిక లాంఛనమేనా?

ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునేందుకు డిసి అధ్యక్షులు ఉదయం తొమ్మిది గంటలకు సమావేశమై తొలుత అధ్యక్షులను, తర్వాత ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. సాగునీటి, డిస్ట్రిబ్యూటరీ సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన మాదిరిగానే ఎన్నిక నిర్వహించనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు మూడు పద్ధతులను అనుసరించనున్నారు. సభ్యుల ఏకగ్రీవానికి అంగీకారం తీసుకుంటారు.

ఏకగ్రీవం కాని పక్షంలో చేతులెత్తే పద్ధతిని అనుసరిస్తారు. ఏ అభ్యర్థికైతే మెజార్టీ సభ్యులు అంగీకారం తెలుపుతారో, వారు ఎన్నికైనట్లుగా ప్రకటిస్తారు. ఈ సందర్భంగా ఇద్దరికీ సమాన ఓట్లు వస్తే రహస్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించనున్నారు. డిస్ట్రిబ్యూటరీలన్నీ కూటమి సానుభూతిపరులే చేజిక్కించుకోవడంతో ప్రాజెక్టు కమిటీలకు ఎన్నిక లాంఛనమే అన్న చర్చ సాగుతోంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులన్నీ కూటమి నాయకులు ముఖ్యంగా టిడిపి నాయకులకే దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

'స్వాభిమాన్'కు 22 వినతులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'స్వాభిమాన్'లో భాగంగా వికలాంగుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 22 వినతులు వచ్చాయి. కవిటి మండలంలో ఆరుగురు నకిలీ వికలాంగ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు పొందారని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కవిటి మండల కేంద్రానికి చెందిన జగదీష్ ఫిర్యాదు చేశాడు. పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వికలాంగులకు ఉద్యోగాలు కల్పించాలని ఎస్.రామారావు కోరారు. వినతుల స్వీకరణలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ అప్పారావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి కవిత పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

సినీ నటి శ్రీలీల

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సినీ నటి శ్రీలీల కోరారు. నగరంలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం వచ్చిన ఆమె జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా ప్రచురించిన డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం పోస్టర్లను ఎమ్మెల్యే గొండు శంకర్, డిఎస్‌పి వివేకానంద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆమెను చూసేందుకు వచ్చిన యువతతో డ్రగ్స్ వద్దు బ్రో నినాదాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమాజం కోసం, తల్లిదండ్రుల కోసం జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మత్తుకు బానిసైతే జీవితం చిత్తవుతుందని గుర్తించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సినీనటి శ్రీలీల



బహుమతులను అందజేస్తున్న ఎస్ఇ కృష్ణమూర్తి

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విద్యుత్ పొదుపు ఆవశ్యకతను తెలియజెప్పారని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

28, 29న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 43వ జిల్లా మహాసభలను టెక్కలిలో ఈనెల 28, 29 తేదీల్లో టెక్కలిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ తెలిపారు. శుభం కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28న టెక్కలి పట్టణంలోని ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి జూనియర్ కాలేజీ మైదానం వరకు భారీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ హాజరు కానున్నారని చెప్పారు. ఉద్యమ రూపకల్పనకు, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణను రూపొందించుకునేందుకు మహాసభలు వేదిక కానున్నాయన్నారు. విద్యారంగ సమస్యలు, విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రచారాల్లో ఉన్నంత శ్రద్ధ ఆచరణలో విద్యారంగ అభివృద్ధిపై లేదని విమర్శించారు. 2018లో సిఎంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ పి.పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, యు.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పలు సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన రీతిలో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. సాగు, తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే విడతల వారీగా పరిష్కరిస్తానన్నారు. పారిశ్రామికరంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయడంతో పాటు అనర్హులకు పింఛన్లు తొలగించనున్నట్లు తెలిపారు. అనంతరం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన డిసి సభ్యులు మంత్రిని కలిశారు. వారిని ఆయన అభినందించారు. కోటబొమ్మాళికి చెందిన అల్లు రమేష్ తన కుమార్తె నిత్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్‌కు రూ.పది వేల విరాళాన్ని మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో కింజరాపు హరివర ప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

త్వరితగతిన 'ఉపాధి' పనులు పూర్తి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో ఉపాధిహామీ పనులపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మంజూరు చేసిన పనులను అలసత్వం లేకుండా సత్వరమే పూర్తి చేయాలన్నారు. చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. బిటి, సిసి రోడ్లు ఇతర పనులను వర్షాలు తగ్గిన వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం పనుల పురోగతిలో తేడా ఉండాలని తెలిపారు. పనులు పూర్తి చేసేస్తే మరిన్ని పనులు మంజూరు చేస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇఇలు ఎస్.రామకృష్ణ, సూర్యప్రకాష్, డిఇలు, ఎఇలు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సిఐ, ఎస్ఐలు, సిబ్బందితో మాట్లాడుతున్న రవివర్మ

తీరప్రాంత పరిరక్షణకు అప్రమత్తం

కోస్టల్ సెక్యూరిటీ ఎస్‌పి రవివర్మ

ప్రజాశక్తి - నౌపడ, సోంపేట

తీర ప్రాంత పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విశాఖ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఎస్‌పి పి.రవివర్మ సిబ్బందిని ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం భావనపాడు, సోంపేట మండలం బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, సిబ్బంది విధుల నిర్వహణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో ప్రమాదాలు సంభవించే ప్రదేశాలు గుర్తించాలన్నారు. సముద్రమార్గం మీదుగా ప్రవేశించే చొరబాటుదారులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముమ్మరంగా గస్తీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

ప్రమాద ప్రాంతాల్లో హోర్డింగులు, లైఫ్ జాకెట్లు, బోట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు గుర్తింపు కార్డులు తీసుకువెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. దత్తత గ్రామాల పనితీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీచ్ ప్రమాదాలపై ముఖ్య సూచనలు సలహాలు ఇస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కోస్టల్ సెక్యూరిటీ సిఐ డి.రాము, రమేష్ కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, శిరీష, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నక్షత్రబాట నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్రబాట నవలను శ్రీకాకుళ సాహితీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా నగరంలోని వరం రెసిడెన్సీలో ఈనెల 22న ఆవిష్కరించనున్నట్లు సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు తెలిపారు. నగరంలోని కథానిలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో రచయిత అట్టాడ అప్పలనాయుడుతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీకాకుళం సాయుధ పోరాటంలో అమరులైన ఎంతోమంది జీవిత ఇతివృత్తాలతో పాటు వారి వారసుల నేపథ్య కోణాన్ని ఆవిష్కరించడమే నక్షత్రబాట నవల రూపకల్పన ముఖ్య ఉద్దేశమన్నారు. రచయిత గంటేడ గౌరినాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పూర్వపు అధ్యాపకులు ఎన్.నిర్మల ఈ నవలను ఆవిష్కరిస్తారని తెలిపారు. మాతృక మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు రమాసుందరి పుస్తక సమీక్ష చేస్తారని చెప్పారు. శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటంలో అమరుల వారసులైన పంచాది రోజా, తామాడ అరుణ, అత్తలూరి అరుణ, సవర సంతోష్ ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో పలువురు రచయితలు, కవులు, మేధావులు పాల్గొంటారని చెప్పారు. నవల ఆవిష్కరణకు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసు, అప్పలనాయుడు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పార్టీలకతీతంగా అభివృద్ధి

ప్రజాశక్తి- జలుమూరు

మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరై గత సమీక్షలో జరిగిన అంశాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్ణీత సమయంలో పూర్తయ్యేందుకు ప్రణాళికలు రూపొందించి కోవాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ కార్యక్రమాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


నీటి సంఘాల సభ్యులను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

బాధ్యతాయుతంగా పనిచేయాలి

కోటబొమ్మాళి: జిల్లాలో కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల సభ్యులు బాధ్యతాయుతంగా పని చేయాలని, చెరువులు, కాలువలు అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ కార్యాలయంలో శుక్రవారం పలాస, టెక్కలి, కోటబొమ్మాళి, పోలాకి మండలాలకు చెందిన నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డిసిలకు అభినందనలు తెలిపారు. అభివృద్ధికి అవసరమైన నిధులను తాను సమకూర్చుతానని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిత్యం సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీరిని అచ్చెన్నాయుడు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విజేతగా నిలిచిన ఇచ్ఛాపురం క్రికెట్ జట్టు

సౌత్‌జోన్ టోర్నమెంట్ విజేతగా ఇచ్ఛాపురం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో అండర్-14 ఫస్ట్‌సౌత్ జోన్ టోర్నమెంట్‌లో విజేతగా ఎపికి చెందిన ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ టీం విజేతగా నిలిచింది. అండర్-14 మొదటి సౌత్‌జోన్ టి 20 టోర్నమెంట్‌లో 12 టీమ్‌లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో శుక్రవారం ఇచ్ఛాపురం బిసిసి క్రికెట్ క్లబ్, తెలంగాణ ఎలైట్ క్రికెట్ అకాడమీ మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన బిసిసి టీమ్ 20 ఓవర్లకు 159/6 రన్స్ చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎలైట్ క్లబ్ 108 పరుగులు మాత్రమే చేయగలిగింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు జస్వెల హర్షవర్ధన్‌కు వరించింది, ఫైనల్ మ్యాచ్‌లో పి.శ్యాంసుందర్ 40 పరుగులతో ఎక్కువ స్కోర్ చేశాడు. వీరికి బిసిసి క్రికెట్ క్లబ్ తరఫున అభినందనలు తెలిపారు.


కేలండర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శివాజీ

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సోంపేట

శ్రీశయన విద్యార్థులకు బాసటగా నిలుస్తున్న చైతన్య దీపిక సంస్థ మాజీమంత్రి గౌతు శివాజీ అభినందలు తెలిపారు. ప్రతిభగల విద్యార్థులకు అందిస్తున్న ప్రతిభా పురస్కార వల్ల విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు చదువులో పోటీతత్వం పెంపొందించే విధంగా వారిలో సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో శ్రీశయన చైతన్య దీపిక సంస్థ 2025 సంవత్సర కేలండర్‌ను గౌతు శివాజీ శుక్రవారం తన స్వగృహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవాద మోహనరావు, కార్యదర్శి దుద్ది బాలరాజు, బీన ఆనంద్, బల్ల బాబురావు, బల్ల జానకీరావు, బంజు లోకనాథం, దుద్ది బాలరాజు, బల్ల కాంతారావు, బీన ప్రదీప్, దూగాన లోకనాథం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

సైన్స్ అధ్యాపకులకు ల్యాబ్ వర్క్‌షాపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం 'వర్చువల్ ల్యాబ్ వర్క్‌షాప్' నిర్వహించారు. సైన్స్ విద్యార్థులకు అమృత విశ్వవిద్యాలయ పీఠం నుంచి రిసోర్స్ పర్సన్స్ సనీష్, నిజిన్ హాజరై వర్చువల్ విధానంలో పలు అంశాలపై బోధనలు అందించారు. ఈ తరగతులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ప్రారంభించారు. వర్చువల్ ప్రయోగాలు ఆధారంగా విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని, సరికొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తాయన్నారు. కార్యక్రమంలో కోర్సు కన్వీనర్ డాక్టర్ టి.స్వర్ణలత, అధ్యాపకులు బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి- పోలాకి

రహదారుల అభివృద్ధిపై పంచాయతీరాజ్ అధికారులు దృష్టి సారించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండలం కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నరసన్నపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలాకి, నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల్లో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పంచాయతీల అభివృద్ధికి నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డిఇ సత్యనారాయణ, ఎఇలు మోహన్, బగ్గు నర్సింగరావు, కె.శ్రీధరరావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


పలాస : కేసుపురంలో వరి పంటను పరిశీలిస్తున్న ఎడిఎ మధు


పొందూరు : పొలాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లోకేష్

ప్రజాశక్తి- పలాస

తుపాను హెచ్చరికల సందర్భంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి కోతలను ఆపాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎల్.వి మధు రైతులకు సూచించారు. మండలంలోని నారాయణ పురం, కేసు పురం, నీలిభద్ర, బ్రాహ్మణతర్ల, లక్ష్మి పురం, కాశీబుగ్గ పూజారి వీధి, కొత్త పారసాంబ తదితర ప్రాంతాల్లో శుక్రవారం వరి పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిన వరి పంటను జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. టార్పాలిన్లు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన వారు రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎక్కడ వరి పంటకు, వరి కుప్పలను ఎటువంటి నష్టం లేదన్నారు. ఆయనతో పాటు మండల ఎఒ పోలారావు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి పంచాది రాధ అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యుల పేట, బొబ్బిలి పేట, చీమల వలస, కట్యాచార్యులపేట, కొత్తవలస, దూసి, తొగరాంలో పంట పొలాలను పరిశీలించారు. వర్షం కారణంగా రైతులు పొలాలలో ఉన్న అపరాల పంట సాగును తగు జాగ్రత్తలు తీసుకొని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఈమెతో పాటు మండల ఎఒ మెట్ట మోహనరావు, ఎంపిడిఒ రోణంకి వెంకట్రావు, సెక్రటరీ బగాది నాగరాజు, వ్యవసాయ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని తొమ్మిది వేల ఎకరాలకు ఇప్పటి వరకు 4 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని ఎఒ నరసింహమూర్తి తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిచిన పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. శుక్రవారం జింకుభద్ర, నూకలూరు, బారువ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. 2 వేల ఎకరాల్లో పంట నూర్పులు జరిగి 3525 క్వింటాళ్ల వరకు ధాన్యం సేకరించినట్టు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


ఆమదాలవలస : పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాధ


సోంపేట : రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ నరసింహమూర్తి

పొందూరు: మండలంలోని తుంగపేట, గోరింట పరిసర ప్రాంతాల్లో పంట పొలాలను మండల ప్రత్యేకాధికారి కె.లోకేష్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే పెనుబర్తి వద్ద గల రైల్వే అండర్ పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరును పరిశీలించారు. ఈయనతో పాటు ఎంపిడిఒ మీసాల మన్మథరావు, ఎపిఒ పైల శ్రీనివాసరావు తదితరులున్నారు.

నాణ్యత, నమ్మకానికి సిఎంఆర్ చిరునామా మంత్రి అచ్చెన్నాయుడు


సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యాపారాభివృద్ధికి నాణ్యత, నమ్మకం తోడ్పడుతుందని, ఈ నమ్మకాన్ని సిఎంఆర్ వాణిజ్య రంగంలో సొంతం చేసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని జిటిరోడ్డులో సిఎంఆర్ వస్త్ర, బంగారు ఆభరణాల షాపింగ్ మాల్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ నటి శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సరికొత్త డిజైన్లతో మార్కెట్‌లో సిఎంఆర్ క్రిస్మస్, సంక్రాంతిని తెచ్చిందన్నారు. శ్రీకాకుళం నగరానికి ఇటువంటి భారీ సంస్థల రాకతో వ్యాపారాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆధునిక శైలికి, అభిరుచికి అనుగుణంగా నిలిచే అన్నిరకాల వెరైటీలు అందుబాటులో ఉంచడం వల్ల ప్రజలను ఆకట్టుకోగలరన్నారు. నగరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, సుందర శ్రీకాకుళం నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకం ద్వారా అరసవల్లి అభివృద్ధికి రూ.100 కోట్లతో అభివృద్ధి చేసేందుకు అనుమతించిందని పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లా అభివృద్ధిలో సిఎంఆర్ సంస్థ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కింజరాపు ప్రసాదరావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎంఆర్ అధినేత మావుళ్ల వెంకటరమణ తమ సంస్థ ద్వారా అందిస్తున్న సౌకర్యాలను, నాణ్యతా ప్రమాణాలను మంత్రికి వివరించారు.


పట్టు వస్త్రాలను ప్రదర్శిస్తున్న నటి శ్రీలీల

నేడు క్రిస్మస్ హైటీ వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా శనివారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో హైటీ వేడుకలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ వేడుకలకు క్రైస్తవ సోదరులు, జిల్లాలోని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, మైనార్టీ విభాగాల ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పాఠశాల గుర్తింపు ఉండాలి

ప్రజాశక్తి- పలాస, టెక్కలి

పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో 2025-2026 విద్యాసంవత్సరానికి గుర్తింపు లేని పాఠశాలలు, ఉన్నత పాఠశాలల నిర్వహణ కోసం అనుమతి పొందాల్సిన పాఠశాలు ఈ నెల 31లోగా మండల విద్యాశాఖాధికారి ద్వారా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పి.విలియం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తేదీ దాటిన తర్వాత పంపే ధరఖాస్తులు స్వీకరించబడవని, రికగ్నైజేషన్ కోసం జాగ్రత్తలు పాటించకుండా అలసత్వం ప్రదర్శించే పాఠశాలపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్చవద్దని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు.

విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సిబిజడ్ ఆఖరి సంవత్సరం విద్యార్థిని ఎ.సూర్య వ్యాసరచన పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి మెదటి స్థానం సంపాదించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ శుక్రవారం సూర్యని అభినందించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న సూర్య మెదటి స్థానాన్ని దక్కించుకుని ప్రతిభ కనబర్చిందని తెలిపారు. సూర్యని అభినందించిన వారిలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్, సిహెచ్ తేజవతి, వి.లూక్‌పాల్, ఎ.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు సంబంధించిన వివిధ అనుబంధ విభాగాలకు నియోజకవర్గానికి చెందిన కొంతమందికి అధ్యక్షులుగా నియమించారు. విద్యార్థి విభాగానికి పట్టణానికి చెందిన ముత్తా విజయ్‌ను, చేనేత విభాగానికి భట్టా సత్యనారాయణ, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగానికి పప్పల రాధాకృష్ణ, మేధావుల విభాగానికి కొప్పల ఈశ్వరరావును అధ్యక్షులుగా నియమించారు. నూతనంగా నియమితులైన అధ్యక్షులను నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

పెచ్చులూడిన భవనంలో విద్యార్థుల అవస్థలు


వర్షపు నీటితో తడిచిన గది

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మర్రిపాడు సి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు పాత భవనంలోనే ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపించింది. శుక్రవారం కురిసిన వర్షానికి పాఠశాల పైకొప్పు నుంచి నీరుకారుతూ పెచ్చులు పడిన దృశ్యాలు కనిపించాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో సమానంగా ట్రాన్స్ జెండర్స్‌కు హక్కులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ట్రాన్స్ జెండర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు సొంతింటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారని, గృహనిర్మాణశాఖ ద్వారా ఇళ్ల మంజూరుకు కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఇళ్ల మంజూరు చేసే అవకాశం ఉందని, అందువల్ల ట్రాన్స్ జెండర్లు కొత్త రేషన్ కార్డు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫించను పొందని వారికి దరఖాస్తు చేస్తామని తెలిపారు. అలాగే సమావేశాలకు హాజరైతే చట్టం నిర్దేశించిన మేరకు అన్ని రకాల పథకాలు పొందడానికి తగిన సహకారం లభిస్తుందన్నారు. ఉపాధి పొందడానికి వీలుగా స్కిల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, స్కిల్ డవలప్‌మెంటు అధికారి సాయికుమార్, సీనియర్ న్యాయవాది ఇందిరాప్రసాద్, యూత్ క్లబ్ డైరక్టర్ ఎం.ప్రసాదరావు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి సన్యాసిరావు

తల్లిదండ్రులను గౌరవించాలి


గెలుపొందిన క్రీడాకారులతో శివాజీ

ప్రజాశక్తి- పలాస

తెలుగుదేశం పార్టీ క్రమ శిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు క్రమ శిక్షణతో మెలగడమే కాకుండా తలిదండ్రులను గౌరవంగా చూసుకోవడం చాలా ఆనందంగా ఉందని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. మండలం గురుదాసుపురంలో సర్పంచ్ ప్రతినిధి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ తండ్రి కుత్తుం నరసింహమూర్తి ప్రథమ వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ లక్ష్మణ్ కుమార్ తన తండ్రిపై ఉన్న ప్రేమతో 5కె రన్, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపు పొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేయడం గొప్ప విషయమన్నారు. ముందుగా జిల్లాస్థాయి 5కె రన్ పోటీలను శివాజీ ప్రారంభించారు. అనంతరం మొదటి స్థానంలో నిలిచిన బిరకట మోక్షకు రూ.15వేలు నగదు, మెమొంటో, రెండో స్థానంలో నిలిచిన పళ్ళ సంతోష్‌కు రూ.10వేలు నగదు, మెమొంటో, మూడో స్థానం వి.భాస్కరరావుకు రూ.5వేలు, మెమొంటో, నాలుగో స్థానం దున్న దుర్గాప్రసాద్‌కు రూ.వెయ్యి, మెమొంటో, ఐదో స్థానం అభి రూ.వెయ్యి, మెమొంటో, కన్సలేషన్ బహుమతులు ఎం హరీష్, బి సాయి సాధించారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్ రావు, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ రామ్ నాయుడు, తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, పిడి తవిటయ్య, పద్మాలోచన, పిఇటిలు ఉన్నారు.

తప్పలను సరిదిద్దేందుకే రెవెన్యూ సదస్సులు


లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

తప్పులను సరిదిద్దేందుకే రీసర్వే ప్రభుత్వం చేపడుతుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని బంటుపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును సర్పంచ్ నడుకుదిటి రజినితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పిఎం, ఎబికి ఆధార్ లింక్ వంటి సమస్యలుంటే ప్రభుత్వ మార్గ నిర్దేశాలను అనుసరించి అర్హులైన అందరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, మండల సర్వేయర్ ఎస్.రవి, ఎంపిటిసి టి.సంజీవ్, వెలిచేటి సురేష్ కుమార్, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: రైతుల సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. మండలం లక్ష్మీపురం, జయ కిష్టపురం, రాజ గోపాలపురం, మరద రాజపురంలో రెవెన్యూ సదస్సులు నిర్వహి ంచారు. ఈ సదస్సుల్లో 38 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వాయులపల్లి సునంద, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు, విఆర్ఒలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి భూసమస్య పరిష్కరించ బడుతుందని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. పెద్దకొత్తపల్లి పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పది దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు కార్యక్రమంలో సర్పంచ్ ఆరేళ్ళ కృష్ణారావు, సర్వేయర్ బల్లాడ శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


మురళీకృష్ణ (ఫైల్)

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చిన్న బాడాంలో శుక్రవారం ఉదయం అట్టాడ మురళీ కృష్ణ (29) అనే యువకుడు చెట్టుకి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు చినబడాంకు చెందిన అట్టాడ ధర్మారావు, అప్పోజీల కుమారుడు మురళీ కృష్ణ గ్రామంలో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేస్తుండే వాడు. అదే గ్రామానికి చెందిన సనపల రాధా కాంత్, సుశీల కుమార్తె సనపల అక్షయను ప్రేమించాడు. దీంతో మురళీ కృష్ణపై అక్షయ తల్లిదండ్రులు కేసు పెట్టారు. 2022 ఆగస్టులో అక్షయను టెక్కలి రిజిస్టర్ కార్యాలయంలో పెళ్లి చేసుకున్నారు. సుమారు ఏడు నెలల పాటు చినబడాంలో మురళీ కృష్ణ ఇంటిలో కాపురం చేశారు. యువతి తల్లిదండ్రులు ఈ వివాహాన్ని అంగీకరించక పోవడంతో ఇద్దరు రెండు నెలల పాటు గ్రామానికి దూరంగా ఉన్నారు. గ్రామానికి తిరిగి వచ్చిన తర్వాత మురళీ కృష్ణ ఇంటి నుంచి యువతిని ఆమె తల్లిదండ్రులు తీసుకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి వీరి మధ్య వైరం నడుస్తుంది. అక్టోబర్‌లో అక్షయ తిరిగి భర్త మురళీ కృష్ణ వద్దకు వచ్చేసింది. అత్తవారింటికి వచ్చిన తర్వాత మళ్లీ యువతిని ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లిపోయారు. ఆ తర్వాత తిరిగి రాలేదు. దీంతో ఈ ప్రేమ వివాహాన్ని మొదటి నుంచి యువతి తల్లిదండ్రులు వ్యతి రేకిస్తున్నట్టు గ్రామంలో చర్చ సాగుతుంది. ఈ సందర్భంలోనే మురళీ కృష్ణ ఇంటికి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందడంపై గ్రామంలో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మురళీ కృష్ణ ఆత్మహత్య చేసుకునే మనస్తత్వం కాదని గ్రామస్తులు చెబుతున్నారు. మురళీ కృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడా...? యువతి తలిదండ్రులు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించరా...? పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన కుమారుడుని అత్తవారే హత్య చేసి ఉంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతున్న కామేశ్వరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన జుత్తు కామేశ్వరరావు కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జి నుంచి కాశీబుగ్గ బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఘటన జరిగిన వెంటనే క్షతగాత్రుడును 108 సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

విచారణకు హాజరైన 'దువ్వాడ'

ప్రజాశక్తి- టెక్కలిరూరల్

వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను స్థానిక జనసేన నాయకుల ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విచారణకు హాజరయ్యారు. ఇటీవల ఆయనకు నోటీసులు ఇచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. జోరు వానలో సైతం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురితో కలిసి టెక్కలి పోలీసు స్టేషన్‌కు హాజరయ్యారు. 2022 నవంబరు నెలలో పవణ్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని జనసేన నాయకులు ఫిర్యాదుపై పోలీసులు 41 నోటిసులపై విచారణకు హాజరయ్యనట్లు తెలిపారు. ఆ ముందురోజు రాష్ట్ర ముఖ్యమంత్రిపై, మంత్రులపై అనుచిత వాఖ్యలు చేశారని అందుకే చేయాల్సి వచ్చిందని తెలిపారు. పోలీసులు పేక్షకపాత్ర పోషిస్తున్నారని, మేము చేసిన ఫిర్యాదుపై ఎలాంటి విచారణ లేదని అధికారపార్టీ నాయకులు వత్తాసు పలుకుతున్నారని ఇలాగే కొనసాగితే న్యాయ స్థానాలకు వెళ్లాల్సి ఉటుందని హెచ్చారించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాపై పోలీసుల కేసులు నమోదు చేసి వైసిపి కార్యకర్తలను హింసిస్తున్నారని, కేసులకు బయపడే ప్రసక్తే లేదన్నారు. ఈయనతో దివ్వెల మాధురి, కోత సతీష్ తదితరులున్నారు.

పంచాయతీ సమావేశం వాయిదా

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ జనరల్ సమావేశం సర్పంచ్ గొండెలి సుజాత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని సభ్యులందరూ వాయిదా వేయాలని కోరారు. అయితే గత నాలుగేళ్ళుగా సభ్యులకు అభివృద్ధి పనులు లేవని ఇప్పటికైనా అభివృద్ధి పనులు కేటాయించాలని, లేదంటే ఈ సమావేశానికి తామెందుకని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక టిడిపి కార్యకర్తలకు పనులు మంజూరు చేశారని ఎలా చేశారని కార్యదర్శి కె.వి.వి.జగన్నాధరావును ప్రశ్నించారు. అయితే మంత్రి ఆదేశాల మేరకు పనులు ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికీ సభ్యులు శాంతించలేదు. అభివద్ధి పనులు తాము గుర్తించిన తరువాత సమావేశం నిర్వహించాలని సభ్యులు పట్టుబట్టారు. దీంతో కార్యదర్శి సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో ఉపసర్పంచ్ గండి విశ్వశాంతి, వార్డు సభ్యులు సువ్వారి రాజేశ్వరరావు, నూనిల సోమేశ్వరరావు, దాడి ధర్మారావు, పీత రమణ, దివ్వెల పోలయ్య, వి.అశోక్, తోట లోకేశ్వరరావు, కింతల తిరమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

రేపు పాణిగ్రాహి 55వ స్మారక సభ

ప్రజాశక్తి- మందస

విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి అమరత్వానికి 55 ఏళ్ళ పూర్తవుతున్న సందర్భంగా పాణిగ్రాహి పోరాట జీవితం - వర్తమాన ప్రాసంగికత - ప్రాధాన్యం అనే అంశంపై ఏడు విప్లవ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డిసెంబర్ 22న 10 గంటలకు శ్రీకాకుళం వద్ద పెద్దపాడు వానవానిపేటలో పాణిగ్రాహి స్మారక బహిరంగను నిర్వహిస్తున్నట్టు ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ , పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ తెలిపారు. ఈ సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎఐకెఎంఎస్, ఐఎఫ్‌టియు, పిఒడబ్ల్యు, అరుణోదయ, పివైఎల్, పిడిఎస్‌యు, ప్రగతిశీల దళిత వేదిక సంస్థలు ఉమ్మడిగా ఈ సభ నిర్వహణ బాధ్యత వహిస్తున్నాయన్నారు. శుక్రవారం మండలం ఉద్దానంలో పాణిగ్రాహి వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విప్లవ స్ఫూర్తితో చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో సుబ్బారావు పాణిగ్రాహి ఆట, పాట విప్లవ పోరాట చరిత్రగా నిలిచిపోయిందన్నారు. ఈ ప్రచారం కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ నాయకులు రాపాక మాధవరావు, ఐఎఫ్‌టియు నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, పిఒడబ్ల్యు జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ, నాయకులు కొమర వాసు, సిత్త గున్నయ్య, సంతోష్ నారాయణ, కృష్ణారావు, సోమేశ్వరరావు, దమయంతి, జ్యోతిలక్ష్మి, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మత్స్యకారులను ఆదుకోవాలి


తాతారావు

పోలాకి: సముద్ర తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార సంఘం నాయకులు కోడ తాతారావు కోరారు. తుపాను సందర్భంగా ఆయన రాజారాం పురం సాగర తీరంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపానులు సంభవిస్తున్న తరుణంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, వేటకు వెళ్లవద్దని ప్రభుత్వాలు సూచిస్తుంటాయని, మత్స్యకారులకు ఆదుకోవడానికి, వారి జీవనం సాగే విధంగా శాశ్వత పరిష్కార మార్గాలు చూపడం లేదన్నారు. ఈ ప్రాంతంలో నిర్మించిన తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని మరమ్మతులు కూడా చేపట్టడం లేదని, తుపానులు, వరదలు వచ్చినప్పుడు మత్స్యకారులు తలదాచుకోడానికి చోటు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మత్స్యకారులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ముగిసిన ఎస్ఎ పరీక్షలు

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఎ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పరీక్షలు గురువారంతో ముగియాల్సి ఉండగా గణితం పరీక్ష ప్రశ్నపత్రం లీకవ్వడంతో ఆ పరీక్ష శుక్రవారం నిర్వహించడంతో పరీక్షలు నేటితో ముగిశాయి. విద్యార్థులు రాసిన జవాబుపత్రాలు మూల్యాంకనం చేసిన వెంటనే ఆయా తరగతి ఉపాధ్యాయులు తక్షణమే మార్కులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విద్యాశాఖాధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఈ మేరకు జవాబుపత్రాలు మూల్యాంకనంలో ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంత్

కాలేయ సమస్యపై నిర్లక్ష్యం వద్దు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో కాలేయ సమస్యను ఎదుర్కొంటున్న వారు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు జరిపించుకోవాలని ప్రముఖ వైద్యులు ఆర్.ప్రశాంత్ సూచించారు. శుక్రవారం నగరంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద ఆస్పత్రిలో కాలేయ సమస్యలపై ఉచిత ఫైబ్రో స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. అక్షయ సేవా సమితి సహకారంతో చేపట్టిన ఈశిబిరంలో ఆయన హాజరై 60 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా ఈపరీక్షలు నిర్వహించడానికి రోగులకు ఆర్థికభారం లేకుండా అక్షయ సేవాసమితి సహకారం అందిస్తుందని అధ్యక్షులు బొడిగ మధు తెలిపారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యలు ఎదుర్కొంటున్న వారు డాక్టర్ ప్రశాంత్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, మణికుమార్, జై కృష్ణ, క్లినిక్ స్పెషలిస్ట్ వినయ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశ్రా'కు ఎక్స్‌లెన్సీ అవార్డు

శ్రీకాకుళం అర్బన్: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఆశ్రా అందిస్తున్న సేవలు అభినంద నీయమని సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తాన్ అలీ అన్నారు. బెంగళూరులో ఇటీవల జాతీయస్థాయిలో 6వ జాతీయ సబ్మిట్‌కు జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తాన్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీకాకుళం ఆశ్రా టీంకు ఎక్స్‌లెన్సీ అవార్డును జిల్లా అధ్యక్షులు డా గంజి ఆర్ ఎజ్రాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు వారి హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో ఆశ్రా బృందం చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.


అవార్డును స్వీకరిస్తున్న ఎజ్రా

నేడు జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ప్రగతి భవన్ (వైసిపి కార్యాలయం) ఆవరణలో శనివారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ జన్మదిన వేడుకలకు సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, జెడ్‌పిటిసిలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు, నాయకులు, యువకులు, మహిళలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఆమదాలవలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు పట్టణ శివారులో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన గల వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఈ వేడుకలు జరుపబడునని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

టెక్కలి రూరల్ : మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు అన్నపూర్ణ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు వైసిపి టెక్కలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వార్డుసభ్యులు , కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వజ్రపుకొత్తూరు: వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గురయ్య నాయుడు కోరారు. కాశీబుగ్గలోని ప్రగతి భవన్‌లో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలైన చేపల పెంపకం వాటి ద్వారా వచ్చే ఉత్పత్తులకు విలువ జోడించినప్పుడే అధిక లాభాలను పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం జిల్లా మత్స్యశాఖ అధికారి పి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపల ఎగుమతి ద్వారా దేశం ఆదాయం పొందుతున్నప్పటికీ దేశీయంగా వినియోగం పెంచడానికి నాణ్యమైన ఉత్పత్తుల తయారీ మార్కెటింగ్ సదుపాయాలు అవసరమని ఆ దిశగా విజన్ 2047 డాక్యుమెంట్ తయారీ అమలుపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు డాక్టర్ నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అపార మత్స్య సంపద నీటి వనరులను వినియోగించుకున్నట్లయితే వలసలను నివారించవచ్చునని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త సిహెచ్ బాలకృష్ణ ఉత్పత్తుల తయారీ విధానాలు అందులోని మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆక్ఫ్ సంస్థ అధినేత నూక సన్యాసిరావు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ, సంతోష్ మత్స్య అధికారులు, మత్స్యకార మహిళలు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కవిటి

బెంతు ఒరియా విద్యార్థులు, యువకుల భవిష్యత్ కోసం 357 రోజులుగా శాంతియుత రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, తమ సమస్యలు గుర్తించి ఇకనైనా తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఎంపిసి మాజీ వైస్ ఛైర్మన్, బల్లిపుట్టుగ సర్పంచ్ ప్రతినిధి రజనీకుమార్ దళాయి కోరారు. ఈ మేరకు శుక్రవారం దీక్షలో బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన బెంతు ఒరియాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే చాలా కమిషన్లు వేసారని, వాటన్నింటి సారాంశాన్ని క్రోడీకరించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ సామాజిక తరగతి ప్రజలకు పూర్తిస్థాయిలో కులం, ఉప కులంతో కూడిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ సర్టిఫికెట్ జారీ చేయకపోవడంతో విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్‌కు అనర్హులవుతున్నారని, దీంతో బెంతు ఒరియా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వాలు మారినప్పుడల్లా కమిషన్ల పేరుతో కాలయాపన జరుగుతోందే తప్పా తమకు న్యాయం జరగడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయకపోతే శాంతియుత ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కండేయ దళాయి తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న బల్లిపుట్టుగ గ్రామస్తులు

అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు విరాళం

కోటబొమ్మాళి: స్థానిక ఎన్‌టిఆర్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు కొత్తగా ఎన్నికైన నీటి సంఘం ఉపాధ్యక్షుడు సంతబొమ్మాళికి చెందిన అల్లు రమేష్‌కుమార్ రూ. 10 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఎన్‌టిఆర్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడుకు అందజేశారు. తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా ఈ మొత్తాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాహుదా గ్రోయిన్ పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం బెల్లుపడ బాహుదా గ్రోయిన్ మరమ్మతులు చేపట్టి అభివృద్ధి చేయాలని నీటి సంఘం అధ్యక్షుడు కొచ్చర్ల ధనుంజయ్ రెడ్డి కోరారు. దాదాపు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించే బెల్లుపడ ఛానల్ అభివృద్ధికి సహకరించాలని తహశీల్దార్ ఎన్. వెంకటరావు, ఎఒ భార్గవిని శుక్రవారం కలిసి ఛానల్ దుస్థితిని వివరించారు. అనంతరం బాహుదా నదిలో ఉన్న బెల్లుపడ ఛానల్ పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ దృష్టికి బాహుదా ఛానల్ దుస్థితిని తీసుకువెళ్లి వివరించనున్నట్టు తెలిపారు. ఈయనతో పాటు అర్. జానకిరామ్, రంగాల శ్రీను, రుక్మందర్ రెడ్డి ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ పిఒగా రాజకుమారి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


రాజకుమారి

ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలకు నూతనంగా జాతీయ సేవా పథకం (ఎన్. ఎస్.ఎస్) యూనిట్ మంజూరైనట్లు ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. కళాశాలకు రెండు యూనిట్లు మంజూరుకు ఉన్నతాధికారులకు కోరినట్లు తెలిపారు. కళాశాలలో గత 14 ఏళ్లుగా వృక్షశాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజకుమారిని పిఒగా నియమిస్తూ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ డి.వనజ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అధికారులకు కృతజ్ఞత తెలియజేస్తూ విద్యార్థినుల్లో సేవా భావాన్ని, స్ఫూర్తిని కలిగించేందుకు కృషి చేస్తానన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒలు

డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

డిజిటల్ లావాదేవీలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు ఎస్. దేవేంద్రరావు, ఎం. పద్మనాభరావు అన్నారు. శుక్రవారం కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వినియోగదారులకు ఏర్పాటు చేసిన ప్రదర్శనకు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోను వినియోగంలో జాగ్రత్తలు వహించాలని లేదంటే ఆర్థికంగా నష్టపోవడం ఖాయమన్నారు. వినియోగదారులను మోసం చేసేందుకు ఫేక్ కాల్ చేస్తుంటారని, లాటరీ వచ్చిందని, లోన్ ఇస్తామని చెప్పి ఓటిపిలు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు అడుగుతారన్నారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల క్లబ్బుల మాస్టర్ ట్రైనర్ ఎల్వి చలం, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీరాములు పాల్గొన్నారు.